క్లుప్తంగా

మాతాశిశు మరణాలను అరికట్టడమే లక్ష్యం



కూడేరు: గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి లక్ష్మీనారాయణ

కూడేరు: మాతాశిశు మరణాలను అరికట్టడమే ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం (పీఎంఎంవీవై) లక్ష్యమని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం కూడేరులోని పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి ఆయన సూచించారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లు అందజేశారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుందుర్పి: మండలంలోని నిజవళ్లిలో శనివారం ప్రభుత్వ ఆరోగ్యశాఖ, స్థానిక అన్వరానంద ఆశ్రమం కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 136 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి అనూష తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు నారాయణస్వామి, సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ అంజినరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, శిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలైన దిగుబడి



మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కుందుర్పి: భూసార పరీక్షలతో మేలైన దిగుబడి సాధించొచ్చని ఏఓ మహేష్ తెలిపారు. శనివారం కుందుర్పి, అప్పిలేపల్లి గ్రామాల్లో రైతులకు భూసార పరీక్షలతో వచ్చే ఫలితాలపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు పంట సాగుకు ముందు పొలాల్లో భూసార పరీక్షలు చేయించాలన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే భూమిలో సారం తగ్గి, పంట దిగుబడి తగ్గుతోందన్నారు. అంతకు ముందు కుందుర్పి సమీపంలో రైతు లక్ష్మణమూర్తి పొలంలో మట్టి పరీక్షలు చేశారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

రాయదుర్గంటౌన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో ఒకేషనల్, జనరల్ ఇంటర్ విద్యార్థులకు జరగనున్న ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్యాబ్‌లో సౌకర్యాలను ప్రిన్సిపాల్ వీరేష్, ఏపీ మోడల్ సెంటర్‌లో ప్రిన్సిపాల్ తోట వెంకటేశులు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 254 మంది, ఒకేషనల్ విద్యార్థులు 274 మంది పరీక్షలు రాయనున్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 140 మంది ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటలకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి



ఎల్‌టీ లైన్లపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం:నియోజకవర్గంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలోని ఏపీఎస్పీడీసీఎల్ ఎలక్ట్రికల్ హెచ్‌టీ మీటర్ల పనులను శనివారం ఆయన పరిశీలించారు. విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. వ్యవసాయానికి విద్యుత్‌ను ప్రభుత్వం నిర్దేశించిన వ్యవధిలో సరఫరా చేయాలన్నారు. నిరంతర విద్యుత్ ప్రక్రియలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, విద్యుత్ అందించాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సలీం, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదిక్కుగా తలుపు తట్టైన్

విధిరాతతో నడవలేని స్థితిలో కొందరు..అందరూ ఉన్నా ఆదరణకు నోచుకోని మరికొందరు..వయసు మీదపడి మంచానికే పరిమితమైన వారు ఇంకొందరు..ఇంటి పెద్దను పోగొట్టుకొని కుటుంబాన్ని పోషించుకోలేక విలవిల్లాడుతున్న వారు ఇంకెందరో.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య..అభాగ్యులందరికీ నేనున్నాను.. నేను విన్నాను.. అంటూ పెద్దదిక్కుగా నిలిచి భరోసా కల్పిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ప్రతి నెలా వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తుండడంతో ప్రతి ఒక్కరి మోములో ఆనందం నిండింది. పది కాలాలపాటు వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు.
– ఉరవకొండ:

- ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ పంపిణీ
- పింఛన్‌దారుల తలుపుతట్టి అందజేత
- లబ్ధిదారుల మోముల్లో ఆనందం

ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్‌దారుల సంఖ్య, పంపిణీ చేస్తున్న నగదు మొత్తం వివరాలు

మండలం పేరు	పింఛన్‌దారుల సంఖ్య	పంపిణీ చేస్తున్న మొత్తం
ఉరవకొండ	10,465	రూ. 3.13కోట్లు
వజ్రకరూరు	7,340	రూ.2.17కోట్లు
విడపనకల్లు	7,100	రూ.2.11కోట్లు
కూడేరు	5,763	రూ.1.70కోట్లు
బెళుగుప్ప	4,765	రూ.1.75కోట్లు
	35,433	రూ.10.86కోట్లు



ఈచిత్రంలో కన్పిస్తున్న వృద్ధురాలి పేరు నాగలక్ష్మి. ఉరవకొండలోని పిండికూరవీధిలో నివాసం ఉంటోంది. ఈమెకు అయినవారెవరూ ఆశ్రయం కల్పించలేదు. ఒంటరిగా జీవిస్తోంది. వృద్ధాప్యం మీద పడడంతో నిలబడే ఓపికలేదు. ప్రభుత్వ రేషన్ బియ్యంతో పూట గడుపుకుంటోంది. రోగమొస్తే మందు బిళ్ల ఇచ్చేవారే లేరు. ఇలాంటి వారి కోసం పెద్ద కొడుకుగా నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. ప్రతి నెలా ఠంఛన్‌గా పింఛన్ ఇంటి తలుపుతట్టి ఇస్తుండడంతో ఈమె హాయిగా కాలం వెల్లదీస్తోంది.



ఈచిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు రాజేష్. బెళుగుప్ప మండలం విరుపాపల్లి. ఇతనికి రెండు కాళ్లూ చచ్చుబడి నడవలేని పరిస్థితి. దివ్యాంగుడు కావడంతో ఉపాధి దొరకలేదు. జగనన్న ప్రభుత్వంలో రాజేష్ జీవితంతో వెలుగు నిండింది. దివ్యాంగ పింఛన్‌తో పాటు ప్రభుత్వం ద్వారా ద్విచక్ర వాహనం అందింది. బెళుగుప్పకు చెందిన దివ్యాంగురాలైన వలంటీరు భాగ్యలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం కింది రూ.1.50 లక్షల ఆర్థిక సాయం కూడా అందింది. దివ్యాంగుల కూడా చేయూతనందిస్తున్న గొప్ప మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజేష్ చెప్తున్నాడు.



ఉరవకొండలోని నాల్గో సచివాలయం వద్ద పింఛన్ దారులు జై జగన్ అంటూ నినదిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం (ఫైల్)

జగన్‌కు రుణపడి ఉన్నాం



ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు, దిక్కులేనివారికి రూ.3 వేలు పింఛన్ ఇచ్చి ఇంటి పెద్దకొడుకుగా ఆదుకుంటున్న జగన్ ప్రభుత్వం పది కాలాల పాటు ఉండాలి. గతంలో ఎవరూ ఇన్ని పథకాలు ప్రవేశపెట్టి, పేదలను ఆదుకోలేదు. మహిళలకు ఎన్నో పథకాలు అందించి, వారిని కూడా జగన్ ప్రభుత్వం ఆదుకుంది.
– వడ్డే సిద్దయ్య, వజ్రకరూరు

తెల్లవారక ముందే తలుపు తట్టి పింఛన్ ఇస్తారు



1వతేదీ రాగానే తెల్లవారుజామునే వలంటీర్ ఇంటితలుపుతట్టి పింఛన్ ఇస్తాడు. గతంలో ఎప్పుడు ఇలా పింఛన్ ఇచ్చిన సందర్భాలు లేవు. పింఛన్ కోసం పడిగాపులు కాసిన రోజులు ఇంకా మరిచిపోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేసింది.
– దేవి జయరాములు, గట్టు వీధి, ఉరవకొండ

పింఛనే జీవనాధారం



ఇంటి పని చేస్తుండగా కాలు విరిగింది. మంచానికే పరితమై ఏపనీ చేతకాదు. ఆస్పత్రికి వెళ్లడానికి కూడా ఆర్థిక స్తోమత లేక అవస్థలు పడ్డా. నా మనువడిలా జగన్ ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకున్నాడు. పింఛన్‌తోనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నా.
– గౌరమ్మ, కూడేరు

బసాపురం అంజన్నకు పూజలు



కూడేరు: ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: మండలంలోని బసాపురం, కూడేరు, రామదుర్గం ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని అర్చకులు పూజలు చేశారు. మొదట క్షీరాభిషేకం చేశారు. పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు.

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

యాత్ర సినిమాను వీక్షించిన మెట్టు

రాయదుర్గం: పట్టణంలోని కేబీ థియేటర్‌లో శనివారం ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, నాయకుడు పొరాళ్ల శివా, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, జెడ్పీటీసీ మల్లికార్జున, వైస్ చైర్మన్ వలీబాష, కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో కలిసి యాత్ర సినిమాను శనివారం వీక్షించారు. అనంతరం మెట్టు మాట్లాడుతూ యాత్ర సినిమా గొప్ప స్ఫూర్తినిస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో కలసికట్టుగా పనిచేసి రాబోవు ఎన్నికల్లో భాగస్వామ్యులై వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు.

దగాకోరు చంద్రబాబు మాటలు నమ్మొద్దు





ఆసరా మెగా చెక్కు అందిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ప్రభుత్వ విప్ కాపు, సభకు హాజరైన మహిళలు

- ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్:టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దగాకోరు మాటలు ప్రజలు నమ్మొద్దని ఏపీఐఐసీ చైర్మన్, రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కు విడుదల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 774 మంది గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.5.32 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మెట్టు మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పథకాన్నీ వారి పేరిట అమలు చేశారన్నారు. గత ఎన్నికల్లో పసుపు–కుంకుమ పేరిట చంద్రబాబు రూ.10 వేలు పంపిణీ చేసినా, మహిళలందరూ వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల కోసం మాయమాటలు చెబుతూ చంద్రబాబు మోసం చేయడానికి వస్తున్నాడన్నారు. మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. వ్యాపార రంగంలో సైతం ఆడపడుచులు ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఇతర నాయకులు ఎన్నికలకు రెండు నెలల ముందు కనిపిస్తున్నారని, నాలుగున్నరేళ్లలో ఎక్కడ ఉన్నారో ప్రజలే ఆలోచించాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాయదుర్గం ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ గంగాధర, ఏపీఎం సురేఖ, ఎంపీపీ పద్మ, మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పయ్యావుల సత్యన్న, లోకేష్, కేశవరెడ్డి, లాలుసాబ్, పరమేశ్వర, జయరామ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రామకృష్ణ, యువరాజ్‌స్వామి, మాబుసాబ్, కృష్ణ, ఫొటో బసవరాజు, బుజ్జి, తిప్పేస్వామి, ఆంజనేయులు,వెంకటేశులు, వనజాక్షి, చిక్కన్న, అనంతరాజు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

- పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు



వజ్రకరూరులో నాయకులు, కార్యకర్తల సమావేశంలో వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విస్తృతంగా పర్యటించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు రామానాయుడు స్వగృహంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు..

టీడీపీ ప్రభుత్వంలో పచ్చకండువాలు కప్పుకున్న వారికి మాత్రమే పథకాలు అందాయని విశ్వ విమర్శించారు. జగన్ పాలనలో అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసినట్లు తెలిపారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా, పారదర్శకంగా పాలన సాగిందన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయన్నారు. రాబోవు ఎన్నికలకు ప్రతి కార్యకర్తా సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు రామానాయుడు, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, యువజన విభాగం జిల్లా కార్యదర్శి డిష్ సురేష్, మండల ఉపాధ్యక్షుడు రాకెట్లబాబు, మాజీ సర్పంచు దాసరి గోవిందు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముస్టూరు రెడ్డి, సీనియర్ నాయకుడు నెటికల్లు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్ కుటుంబ సభ్యులకు పరామర్శ..: వజ్రకరూరులోని జేసీఎస్ మండల కన్వీనర్ ఉస్మాన్ కుటుంబ సభ్యులను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. జేసీఎస్ మండల కన్వీనర్ ఉస్మాన్ తల్లి అప్మత్‌బీ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే విశ్వ ..ఉస్మాన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైఎస్ జగన్ పాలన స్వర్ణయుగం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మెట్టు విశ్వనాథరెడ్డి

రాయదుర్గం (డీ హీరేహాళ్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన స్వర్ణయుగమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం డీహీరేహాళ్ మండలంలోని పాత హడగలి, కొత్త హడగలి, బాదనహాళ్, కాదలూరు, దొడగట్ట గ్రామాల్లో సర్పంచులు లీలావతి, లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి ప్రజల్లో అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ఏ ఇంటికెళ్లినా నాలుగున్నరేళ్ల పాలనలో అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలే వివరిస్తున్నారన్నారు. రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీ సాధించనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ఎన్ని వేషాలు వేసినా, ఎందరితో పొత్తు పెట్టుకున్నా చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, సోములాపురం సర్పంచ్ సుదర్శనరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, పార్టీ నాయకులు కాదలూరు హనుమంతరెడ్డి, పెద్ద ఆంజనేయులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: గుత్తి మండలం సేవాఘడ్‌లో ఈ నెల 13,14,15 తేదీల్లో జరగనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాల పోస్టర్లను ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి విడుదల చేశారు. శనివారం ఆయన మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజునాయక్, గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్, జీవీఎస్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హరినాయక్,నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు మోహన్‌నాయక్, వెంకటేశ్‌నాయక్, ప్రసాద్‌నాయక్, గోపినాయక్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే



జగనన్న కాలనీలో ఇంటిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: పేదవాడి సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జగనన్న కాలనీలో స్థానిక వై ఎస్సార్‌సీపీ నాయకుడు నల్లబోతుల కిరణ్ కుమార్ నూతనంగా నిర్మించిన ఇంటిని ప్రారంభించారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డిని నల్లబోతుల కిరణ్, కుటుంబ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, యువిజన విభాగం జిల్లా కార్యదర్శి డిష్ సురేష్, మండల కార్యదర్శి నల్లబోతులరాజు, మండల ఉపాధ్యక్షుడు రాకెట్లబాబు, ఎస్సీసెల్ నాయకుడు ప్రభుదాస్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముస్టూరురెడ్డి పాల్గొన్నారు.

12న మాజీ ఎమ్మెల్యే పర్యటన

కూడేరు: మండలంలోని పి.నాగిరెడ్డి పల్లిలో ఈ నెల 12న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వేశ్వర రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు మండల సర్వసభ్య సమావేశం

బెళుగుప్ప: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ సుబ్బరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

హంద్రీనీవా కాలువలో యువకుడి గల్లంతు

ఉరవకొండ: కొకుంట్ల సమీపంలోని హంద్రీనీవా కాలువలో మస్తాన్‌వలి అనే యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు.. గుంతకల్లుకు చెందిన మస్తాన్‌వలి కొకుంట్లలోని అవ్వ ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి కాలువలో దిగాడు. ఎంతసేపటికీ ఒడ్డుకు రాకపోవడంతో తోటి స్నేహితులు బంధువులు, పోలీసులకు తెలియజేశారు. గజ ఈతగాళ్లతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కర్ణాక మద్యం పట్టివేత

బ్రహ్మసముద్రం : ఎరడికెరకు చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా చెక్‌పోస్టులో పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 288 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు పంపించామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ లింగమయ్య తెలిపారు.

210 లీటర్ల డీజిల్ పట్టివేత

గుమ్మఘట్ట: కేపీ కుంట చెక్ పోస్టు వద్ద కర్ణాటక నుంచి తెస్తున్న 210 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. వాహన తనిఖీల్లో మహమ్మద్ అనే వ్యక్తి పట్టుబడినట్లు తెలిపారు.

బూదగవిలో హుండీ తొలగింపు

ఉరవకొండ: ప్రసిద్ధ క్షేత్రం బూదగవి సూర్యదేవాలయంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన హుండీని ఈఓ అంగడాల కృష్ణయ్య, అర్బన్‌సీఐ తిమ్మయ్య, ఎంపీపీ నరసింహులు, నాయకులు ధనంజయ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఈఓ మాట్లాడుతూ రథసప్తమి వేడుకలు ఆలయ ఈఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రాలను రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్ బాబు, బొమ్మనహాళ్ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. పాఠశాలలోని విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పీటీఆర్‌పల్లి ఎగువతండాకు చెందిన కవితాబాయి అనే వివాహిత కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని వక్తలు పిలుపునిచ్చారు.శనివారం స్థానిక జనార్ధన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సత్యసాయి ఆర్గనైజేషన్ గుంతకల్లు సమితి ఆధ్వర్యంలో ప్రేమతరువు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ధర్మకర్తల మండలి సభ్యులు, బాలవికాస్ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి

బెళుగుప్ప: వ్యాపారులు, చౌకధాన్యపు దుకాణాల్లో వినియోగించే ఎలక్ట్రికల్ తూనికలు కొలతల యంత్రాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని లీగల్ మెట్రాలజీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వైబీ శంకర్ తెలిపారు. శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద వ్యాపారుల వేయింగ్ మిషన్లను పరిశీలించారు. రెన్యూవల్ అనుమతితోపాటు ముద్రికలను వేశారు. లీగల్ మెట్రాలజీ కార్యాలయ టీఏలు షంషేర్, ప్రకాశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కూడేరు: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు చేయనుండడంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ గౌస్ పీరా ఓ ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి సాధించినట్లు నాయకులు అన్నారు. శనివారం వేపులపర్తిలో మండల పరిషత్ నుంచి మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీటీసీ బుసప్ప, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తి ప్పారెడ్డి, శరణప్ప, మహాలింగ ,ఈశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరం 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి శనివారం తెలిపారు. http//mjpapbcwreis.apcfss.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

అమిలినేని అనుచరుల హడావుడి

కళ్యాణదుర్గం: తెలుగుదేశం పార్టీ కళ్యాణదుర్గం టికెట్ ఎస్ఆర్‌సీ అధినేత అమిలినేని సురేంద్రబాబుకు కేటాయించినట్లు అధిష్టానం నుంచి సంకేతాలు వచ్చాయని అనుచరులు హడావుడి చేశారు. శనివారం కళ్యాణదుర్గం పట్టణంలో సురేంద్రబాబు అనుచరులు ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కళ్యాణదుర్గం మండంలోని ఓ యువ నాయకుడు, సర్పంచ్ తదితరులు అధిష్టానం తమ నాయకుడికే సీటు కేటాయించిందని హంగామా చేశారు. ఏకంగా పార్టీ కార్యాలయం ఏర్పాటుకు శెట్టూరు రోడ్డులోని బ్రహ్మయ్య స్వామి ఆలయం వెనుకవైపునున్న స్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గీయులు, ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు వర్గీయులు అయోమయంలో పడ్డారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జ్‌లు చెరోవైపు కార్యక్రమాలు చేస్తుండగా మధ్యలో కొత్త వ్యక్తి పేరును ఎలా ప్రతిపాదిస్తారని ఇరుపార్టీల నేతలు మండిపడుతున్నారు. పార్టీ అధిష్టానం నుంచి ఎలాంటి సంకేతాలు రాకముందే ఇలా పార్టీ కార్యాలయాలకు స్థలాలు చూడటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'కాపు వ్యాఖ్యలు అర్థరహితం'



సమావేశంలో మాట్లాడుతున్న గౌని ఉపేంద్రారెడ్డి

రాయదుర్గం: ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అర్థరహితమైన వ్యాఖ్యలు, కించపరిచేలా పోస్టులు పెట్టడం సరైంది కాదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కోకూర్తి ఉషారాణి, పార్టీ నాయకులు పొరాళ్ల శివా, ఎర్రగుంట కేశవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గౌని నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓడిపోతే ఇన్‌చార్జ్ పదవి కోసం తామంతా కాసుకుని కూర్చున్నామని విమర్శలు చేయడం సరికాదన్నారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయి 14 నెలల పాటు కాపు తిరిగిచూడకపోయినా పార్టీ కార్యక్రమాలన్నీ భుజాన వేసుకొని నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి కట్టుబడే పార్టీ క్యాడర్ మొత్తం పనిచేస్తోందన్నారు. సమన్వయకర్తగా మెట్టు గోవిందరెడ్డిని పార్టీ నియమించడంతో ఆయన వెంట నడుస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నిధులు తెచ్చే విషయంలో ముఖ్యమంత్రిని, మంత్రిని కలిశామే తప్పా ఇన్‌చార్జ్ కావాలనే విషయం ఎక్కడా చర్చకు తీసుకురాలేదని పొరాళ్ల శివ అన్నారు.